వాడు నాకు ప్రియుడు అని భగవంతుడు చెపుతున్నాడు.

నన్నే స్మరించుకో, నాకు ఇష్టమైన పనులే చెయ్యి, నాగురించే మాట్లాడు అని ఇలాఎన్నో మెట్లు భగవంతుడుచెపుతున్నాడు. ఎక్కడోఒకచోట మనపిలకవాడు పట్టుకోవటంకోసం ఇలా ఎన్నో చెపుతున్నాడు. ఇలాకాకపోతే అలాచెయ్యి, అలాకాకపోతే ఇలాచెయ్యిఅని చెపుతున్నాడు ఎవడుచెపుతాడు మన ప్రేమికుడు తప్ప ఇలా ఎవడుచెపుతాడు. మనమీద పరిమితులులేని ప్రేమఉందికాబట్టి ఏదోరకంగా ఆయనలో ఐక్యంచేసుకోవటంకోసం ఇవిఅన్నీచెపుతున్నాడు. నీవునేనుఅనగ నిత్యానందమయముగ నిలుచుస్థితి కరుణింపు అరుణాచలా అన్నారు భగవాన్. నీవువేరు, నేనువేరుఅని బేదబుద్ధి ఉన్నప్పుడు హృదయంలోఉన్న ఆనందం నాచేతికి అందదు. అందుచేత నేనుఅణిగిపోతాను, నీవుకూడా అణిగిపో అప్పడు అద్వైతానుభవం కలుగుతుంది, హృదయంలోఉన్న ఆనందం నాచేతికి అందుతుంది.

**నీ కర్తవ్యం నీవు నిర్వహించడమే భగవంతునికి నిక్కమైన నమస్కారం. శ్రద్ధాభక్తులతో కర్తవ్య నిర్వహణకంటే ఉత్తమమైన భగవత్సేవ మరిలేదు. అట్లే, నీవు ఏది భుజించినా అహంకార వివర్జితుడవై భుజించు. అప్పుడు నీవు భుజించేది ప్రతీదీ భగవత్ప్రసాదమే అవుతుంది.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**





**ఓం నమోభగవతే శ్రీరమణాయ**

# రమణభాస్కర

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 26-12-01, కాపవరం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గీతాజయంతి. భగవద్గీతకు అంతగొప్పతనం ఎందుకువచ్చిందిఅంటే భగవంతుడిని ఎలాపూజచేసుకోవాలి, ఎలాస్మరించుకోవాలిఅనే విషయము దగ్గర మొదలుపెట్టి మనోనాశనం ఎలాచేసుకోవాలి, మహావెలుగులోనికి ఎలా ప్రవేశించాలిఅనే విషయంవరకు ఎన్నో ఉపాయాలు, ఎన్నోసాధనలు క్రమంగా జీవకోటిమీద అపారమైన ప్రేమతో భగవంతుడు బోధించాడు. వేదాలసారం, ఉపనిషత్‌లసారం భగవద్గీత. ఉపనిషత్తులను ఆవుగాచేసుకొని కృష్ణుడు పాలుపితికి అర్జునుడికి పోసాడు అదే భగవద్గీత. ఆపాలు అర్జునుడుతాగాడు, మన పెద్దలు చాలామంది తాగారు, పాలుఇంకామిగిలి ఉన్నాయి మనంకూడా ఆపాలుతాగవచ్చు, తాగే ఓపికఉండాలి, జీర్ణంచేసుకొనే శక్తి మనకు ఉండాలి. మీరు అందరూ నావారే. ఈ ప్రపంచంఅంతా ఒకలీల. నా స్వరూపంమీకు తెలిసేవరకూ, చైతన్యంలో మీరు ఐక్యంఅయ్యేవరకూ మిమ్మల్ని విడిచిపెట్టను. మేము మట్టివాళ్ళముఅని మీరు అనుకొంటున్నారు మీరు మట్టివాళ్ళుకాదు, మీరు ప్రకృతివాళ్ళుకాదు, మీరు నావారుఅని భగవంతుడు చెపుతున్నాడు. మీ ముక్కులోగాలి తిరుగుతున్నంతవరకు మీరు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దుఅని భగవంతుడు చెప్పాడు. స్వార్ధంలేకుండా మీరు ఏపనిచేసినా అది యజ్ఞంతో సమానము. దానంఅంటే కేవలం డబ్బుఇవ్వటం మాత్రమే దానంఅనుకోవద్దు, నీవు మాటసహకారంచేసినా అది దానంతోసమానము. దానంప్రీతితో, ప్రేమతోచేయాలి. పునర్జన్మ కారణములు మనస్సులోఉన్నాయి. ఆమనస్సును ఎండింపచేయటం తపస్సు. చేప నీటిప్రవాహమునకు ఎదురుఈదుతుంది అలాగే నీవు మనోప్రవాహమునకు ఎదురుఈదు. అప్పడు మనోమూలంలోనికి వెళతావు. అప్పడు ఆనందమేఆనందం, శాంతేశాంతి. మనోమూలంలోనికి వెళితే మనలను మనం పోగొట్టుకొంటామేమోఅని చాలామందికి భయం. మనలను మనం పోగొట్టుకోము, మనం ఎవరోమనకు తెలుస్తుంది, భగవంతుడు మనకు

స్వరూపంగా వ్యక్తమవుతాడు.

కామంఅంటే కోరిక. నీమనస్సు ఎక్కడికివెళ్ళివాలుతోందో అక్కడ కోరికఉందిఅనిఅర్థం. మనకు అనేకరకాలభయాలు. ఏదో ఆశించిపనిచేస్తాము అది నెరవేరదేమోఅనిభయం. ఏదోపదవి ఆశిస్తాము అదిరాదేమోఅనిభయం. మానవుడికి ఆత్మానుభవం కలిగేవరకూ ఏదోరకమైన భయం వెంటాడుతూఉంటుంది. భయంఎక్కడుంది. భయంమనస్సులోఉంది. మనస్సు నశిస్తే భయంనశిస్తుంది. మనస్సు ఎలానశిస్తుందిఅంటే పూర్ణశరణాగతివలన మనస్సు నశిస్తుంది. మీరు 90 వంతులు శరణాగతిచేసి 10 వంతులు చేయలేదుఅనుకోండి ఆ 10 వంతులు భయం మీకూడా వచ్చేస్తుంది. అందువలన పూర్ణశరణాగతి అవసరం. ఎవరికైనా మీమీద అసూయఉంటే వారు మిమ్మల్ని ఏదోరకంగా విమర్శిస్తూఉంటారు. వారు అసూయపడుతున్నారుఅని తెలిసినా మీరు అసూయపడవద్దు. అసూయపడుతూఉంటే శరణాగతియొక్క వేగం తగ్గిపోతుంది. భగవంతుడు ఒకడు ఉన్నాడు. వాడికి తెలియకుండా ఈసృష్టిలో ఏమీజరగటంలేదుఅని పరిపూర్ణమైన విశ్వాసంఉన్నవాడికి శరణాగతి కుదురుతుంది, విశ్వాసంలేనివాడికి శరణాగతి కుదరదు. మీ విశ్వాసంలో ఎంతవెలితిఉంటే అంతభయం మీకూడా వచ్చేస్తుంది. మోక్షం సంపాదించాలిఅని ఏదో ఆదర్శంపెట్టుకొని మనం ప్రయత్నంచేస్తూఉంటాము. లోకంలో అందరికి మోక్షం సంపాదించాలిఅని ఉంటుందా? ఉండదు. వారు మిమ్మల్ని విమర్శిస్తూఉంటారు. అప్పుడు కంగారుపడి భగవంతుడిని వదిలివేస్తే మరల వెనుకకు వెళ్ళిపోతారు. కొంతమంది లోకప్రయోజనాలకోసం భగవంతుడిని నమ్ముతారు. కొంతమంది ఎలా ఉంటారుఅంటే నీవు సృష్టించిన ఈలోకం మాకు అక్కరలేదు, నీవే మాకుకావాలి అంటారు. వారు ఉత్తమ భక్తులు.

కాకినాడనుండి వచ్చిన ఒకరు భగవాన్‌తో ఆశ్రమంలో ఈపొరపాట్లుఉన్నాయి మీరు వాటిని సవరించాలిఅని చెపుతాడు. అప్పుడు భగవాన్ అతనితోనీవు ఎక్కడనుండి వచ్చావుఅని అడిగారు. నేను కాకినాడనుండి వచ్చానుఅని చెప్పాడు. పొరపాట్లు సవరించటానికి కాకినాడనుండి అరుణాచలం రావటం ఎందుకు? కాకినాడలో పొరపాట్లు లేవా అక్కడే పొరపాట్లు సవరించుకో. ఇంతదూరం రావటం ఎందుకు? నీవు ఏపనిమీద ఇక్కడకు వచ్చావో ఆపనిచూసుకో. ఇక్కడ పొరపాట్లు గొడవనీకుఎందుకు? దాని అర్థం ఏమిటిఅంటే మనం ఈభూమిమీదకు ఎందుకువచ్చామో ఆపనిమర్చిపోకూడదు. వచ్చిన పనిమర్చిపోకూడదు. ఆపనినెరవేర్చుకోవటంకోసం నీశరీరాన్ని, మనస్సును, ఇంద్రియాలను వీలైనంతగా ఉపయోగించుకోవాలి. బ్రహ్మానుభవంపొందటానికి నీశరీరాన్ని, మనస్సును, పరిసరాలను, మహాత్ములను అందరిని ఉపయోగించుకోవాలి. మనకు భక్తిలేదుఅనికాదు, విశ్వాసంలేదుఅనికాదు. ఎంత ఉండాలోఅంతలేదు. పూర్తివిశ్వాసంఉన్నవాడు మాత్రమే భయంనుండి విడుదలపొందుతాడు. రాగము, భయము, కోపము వీటిని విడిచిపెట్టమని భగవంతుడుచెప్పాడు. రాగకారణం ఉన్నప్పటికి మీరు రాగంలేకుండాఉంటే, భయకారణం ఉన్నప్పటికి మీరు భయంలేకుండాఉంటే, మీరుకోపం తెచ్చుకొనేకారణం ఉన్నప్పటికి కోపంలేకుండాఉంటే సడన్‌గా భగవంతుని దయమీమీద వర్షిస్తుంది, మీకు అమృతానుభవం కలుగుతుంది. మీఇంటిలోని బంగారాన్ని, విలువైన వస్తువులను ఎలాజాగ్రత్తగా చూసుకొంటున్నారో, వాటిని ఎలా దాచుకొంటున్నారో అలాగ భగవద్గీతలో భగవంతుడు చెప్పిన విషయాలను, వాటిసారాన్ని అంతవిలువగా చూసుకొని మీహృదయంలోదాచుకోండి. భగవద్గీతమీద ప్రేమఉంటే, గౌరవంఉంటే దానిహృదయాన్ని మనకు ఇస్తుంది. గీతలో ప్రతీశ్లోకంలో నేను ఉన్నాను, నీవు భయపడవద్దుఅని ఎక్కడికక్కడ భగవంతుడు మనకు సపోర్టుఇస్తూఉంటాడు. దేహం నిలబడటానికి ఆహారం ఎటువంటిదో, మనజీవుడు బాగుపడటానికి గీతలోశ్లోకాలు అటువంటివి. తిలక్‌గారిని చాలాకాలం జైలులోపెట్టారు. మనలను జైలులోపెడితే ఏడుస్తూకూర్చొంటాము. కాని తిలక్‌గారు ఏమనుకొన్నారుఅంటే ఇది భగవంతుడు నాకు ఇచ్చిన అవకాశంఅనుకొని భగవద్గీతకు వ్యాఖ్యానంవ్రాసారు. కొంతమంది చెడ్డనుకూడా మంచికి ఉపయోగించుకొంటారు. ఆయన జైలునుకూడా అనుకూలంగా త్రిప్పుకొన్నారు. అది పోజిటివ్ తింకింగ్.

నీకు పనిచేయటానికే అధికారంఉంది. నీవు విసుగులేకుండా పనిచెయ్యి, కపటంలేకుండా పనిచెయ్యి. హృదయపూర్వకంగా పనిచెయ్యి. ప్రచారంకోసం పనిచేయవద్దు. మనకు కావలసింది ప్రచారంకాదు, పవిత్రతకావాలి. పవిత్రుడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం పవిత్రులంఅవ్వటానికి జీవితంపొడుగునా కృషిచెయ్యాలి. మానవస్వభావం అత్యంత బలీయమైనది. స్వభావాన్ని మార్చుకోవటం చాలాకష్టం, దానికి ఎంతోపోరాటం అవసరం.

స్వభావాన్ని మార్చుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి అదేసాధన. కర్మఫలంమీద నీకు అధికారంలేదు. నీచేతిలోఉన్నపనిని శ్రద్ధగాచెయ్యి. కర్మఫలంవస్తే గర్వపడకు, కర్మఫలం రాకపోతే కృంగిపోకు. గర్వపడటం ఒకవికారం, కృంగిపోవటం ఒకవికారం, రెండూచెడ్డే. ఫలంవచ్చినా రాకపోయినా సమానంగాఉండు. మనంఅనుకొన్న పనిఅయినప్పుడు ఒకలాగ, పనిఅవ్వకపోతే ఒకలాగ ఉండవద్దు. అలాఉంటే అజ్ఞానంలోకూరుకొనిపోతావు. ఫలం ఆశించి కర్మనుచేయవద్దు. కోరికతో ఫలంతెచ్చుకొంటే అది నిన్ను బంధిస్తుంది. బంధంవలన బ్రాంతివస్తుంది. బ్రాంతివలన వేలాది శరీరాలు మోయవలసివస్తుంది. ఫలాపేక్షలేకుండా కర్మనుచేస్తే ఫలంవచ్చినా రాకపోయినా మనస్సు నశిస్తుంది. కర్మఫలాన్ని ఆశించవద్దుఅని చెపుతున్నానుకదా అని మొత్తానికి కర్మను విడిచిపెట్టవద్దు. ముసలమ్మగారిమెడలో గొలుసుగురించి ఆశపడవద్దుఅని చెపుతున్నానుకదాఅని ముసలమ్మగారిని చూడటం మానవద్దు. ఆవిడఇస్తే పుచ్చుకోండి, లేకపోతే లేదు. గొలుసు గురించి ఆశపడవద్దు. ముసలమ్మగారిలో ఉన్న జీవుడుఎవడు? వాడు నావాడు అది మర్చిపోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. ఆ జీవరూపంలోనేను ఉన్నాను. ఆ జీవుడికి సేవచేస్తే నాఅనుగ్రహాన్ని పొందుతావు.

రాగద్వేషములనుండి ఎవడైతే విడుదలపొందాడో వాడికి ఎటుచూసినా ఆనందమే, ఏలోకానికివెళ్ళినా ఆనందమే. అందువలన రాగద్వేషములమధ్య కూర్చోవద్దు. వాటినుండి విడుదలపొందు. లోపలకువెళ్ళు. మనస్సు ఎక్కడనుండి వస్తోందో అక్కడకువెళ్ళు. భగవంతుడు నీకు ప్రత్యక్షమయ్యి వెయ్యి జన్మలదాకా నీకు మోక్షం ఇవ్వనుఅంటాడుఅనుకో. వెయ్యిజన్మలవరకురాదా అని కృంగిపోవద్దు. వెయ్యిజన్మల తరువాతఅయినా మోక్షంఇస్తావుకదా ప్రభువాఅని సంతోషిస్తే ఈజన్మలోనే ఇచ్చేస్తాడు. నీ మనస్సు ఎంతవరకు ప్రిపేర్అవుతోందో చూస్తూఉంటాడు. కంగారుపడవద్దు. కొంచంకొంచంగా మంచిచేసుకొంటూవెళ్ళు. నీలోఉన్న బలహీనతలు నెమ్మదిగానశిస్తాయి. అప్పుడు భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుఅవుతావు. ఆయన అనుగ్రహానికి పాత్రుడవు అయిన వెంటనే ఆయన స్వరూపాన్ని నీకుఇస్తాడు. ఇదిఅంతా ఒక్కరోజులో చేసాయాలిఅని అనుకోవద్దు. నెమ్మదిగాచేసుకొంటూవెళ్ళు. చేసేపని ధైర్యంగాచెయ్యి, ఆత్మవిశ్వాసంతోచెయ్యి. ఎవరో విమర్శిస్తున్నారుఅని కంగారుపడవద్దు. అది పిరికితనం, నీవు ధైర్యాన్ని విడిచిపెట్టవద్దు, సహనాన్ని విడిచిపెట్టవద్దు. నీవు సహనంగాఉంటే, ధైర్యంగాఉంటే, శాంతిగాఉంటే సమాజంతోకూడా ఆనందంగా ఉండగలవు.

నీమనస్సు ఇప్పుడు విషయాలమీద వాలుతోంది. నెమ్మదిగా ఆ విషయాలనుండి నీమనస్సును మరలించి నాయందు నిలబెట్టుఅని భగవంతుడు చెపుతున్నాడు. ఇతర చింతలులేకుండా ఎవడైతే నన్నే ప్రేమిస్తున్నాడో వాడు అనన్యప్రేమికుడు. వాడు నాకుభక్తుడు. అందరి హృదయాలలో అంతర్యామిగానేనుఉన్నాను. అందరిలోఉన్న నన్ను ఎవడైతే చూస్తున్నాడో వాడు నిజమైన చూపుగలవాడు, మిగిలినవారు దొంగచూపుకలవారు. మనలో అంతర్యామిగాఉన్నభగవంతుడిని వదిలేసి మనలోఉన్న వికారములనుచూస్తూఉంటే వాడు దొంగచూపు కలవాడు. నీవికారం నీవుకాదు. నీతలంపునీవుకాదు. నీమనస్సునీవుకాదు. నీవుచింతించే విషయాలు నీవుకాదు. నీహృదయంలో అంతర్యామిగా ఒకడు ఉన్నాడు. వాడిని చూడటంనేర్చుకో. నిరంతరం నన్నే స్మరించేవారి యోగక్షేమములను నేనుచూస్తానుఅని భగవంతుడుచెపుతున్నాడు. యోగక్షేమాలు అంటే లేనిదిఇస్తాను, ఉన్నదికాపాడుతానుఅని చెప్పటం. కాని ఇక్కడ ఒక ప్రమాదంఉంది ఆయన ఇస్తానుఅన్నాడుకదాఅని యోగక్షేమాలను మనం కోరుకొంటే మరల ప్రకృతిలోనికి వచ్చేస్తాము. ఆయనఇస్తే పుచ్చుకోవచ్చు కాని వాటిని మనం కోరుకొంటే బంధంలోపడతాము. కృష్ణుడికి వెన్నదొంగఅనిపేరు. మన మనస్సును వెన్నలాగ చేసుకొంటే ఆయన దొంగతనంచేసి పట్టుకొనిపోతాడు, ఆయన స్వరూపం మనకుఇస్తాడు. అంటే అప్పుడు మనస్సు పీడపోతుంది. లోపలఉన్నఆనందం మనకు వ్యక్తమవుతుంది.

**రమణ భాస్కర**

**కామాది అరిషడ్వర్గాన్ని ఎలా నిగ్రహించడం? ఈ ఉద్వేగాలు ఎవరిలో కనుక్కో, నీవ్వు ఆత్మస్థుడవై ఉండగలిగితే ఆత్మకంటే వేరుగా నీకేదీ కనిపించదు. అప్పుడు నిగ్రహించడమనే ప్రసక్తికే అవకాశం వుండదు.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

20-01-2002